ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సంగారెడ్డి మెదక్

5

బుధవారం 17 జూలై 2024

జిల్లాల వార్తలు





పరవళ్లు తొక్కుతూ ప్రవాహం

కర్ణాటక- తెలంగాణ సరిహద్దులోని సంగారెడ్డి జిల్లా జాడిమల్కాపూర్ జలపాతం కనువిందు చేస్తోంది. కర్ణాటకలోని అటవీ ప్రాంతం నుంచి వచ్చే వరద నీరు ఇక్కడి గుట్టలు, కయ్యల మీదుగా ప్రవహిస్తూ సందర్శకులకు కనువిందు చేస్తోంది. ఈ నీరు మళ్లీ కర్ణాటకలోని చంద్రంపల్లి ప్రాజెక్టులోకి చేరుతుంది. నీటి ప్రవాహాన్ని చూసేందుకు ఇరు ప్రాంతాల నుంచి జనం వస్తున్నారు. జాలువారుతున్న వరద నీటిని చూస్తూ కేరింతలు కొడుతున్నారు.

జహీరాబాద్, జూలై 16



- అక్రమంగా పట్టుబడితే అంతే..
- నెలల తరబడి గోదాముల్లోనే..
- రంగుమారి.. పురుగులు పట్టి..
- ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో 16వేల క్వింటాళ్లు పట్టివేత



సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్‌లోని సివిల్ సప్లయ్ గోదాములో బియ్యం బస్తాలకు బూజు

పేదల బియ్యం.. పందికొక్కుల పాలు!



సంగారెడ్డి గోదాములో పురుగులు పట్టి, గడ్డలు కట్టిన బియ్యం నిల్వలు

సంగారెడ్డి జిల్లాలో గత డిసెంబర్‌లో అక్రమంగా తరలిస్తున్న 236 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. ఆ బియ్యాన్ని జిల్లా కేంద్రంలోని సివిల్ సప్లయ్ స్టాక్ గోదాంలోకి తరలించారు ఆ తర్వాత అధికారుల అనుమతితో ఈ బియ్యాన్ని వేలం వేయాలి. కానీ, ఇప్పటివరకు ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆ బియ్యం కాస్తా గోదాములోనే పందికొక్కులకు, పురుగులకు ఆహారంగా మారుతోంది.

సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండల కేంద్రంలోని గోదాములో ఏడాది క్రితం పట్టుకున్న 62 క్వింటాళ్ల అక్రమ బియ్యాన్ని నిల్వ చేశారు. ఈ బియ్యాన్ని వేలం వేయకపోవడంతో ఎక్కడికక్కడ పాడైపోతున్నాయి. రంగుమారడంతో పాటు బూజు కూడా పట్టాయి. మూగజీవాలకే తప్ప మనుషులు తినడానికి పనికొచ్చేలా కనిపించడంలేదు.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జూలై 16: సంగారెడ్డి, దౌల్తాబాద్ సివిల్ సప్లయ్ స్టాక్ పాయింట్లలోనే కాదు. ఉమ్మడి జిల్లాలోని పలు గోదాముల్లో అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్న రేషన్ బియ్యం పనికి రాకుండా పోతోంది. పట్టుకున్న సమీప గడువులోనే సంబంధిత అధికారుల అనుమతితో ఈ బియ్యాన్ని వేలం వేయాలి. తద్వారా ఆదాయంతోపాటు బియ్యాన్ని వినియోగించే అవకాశం ఉంటుంది. కానీ, తాజా పరిస్థితుల నేపథ్యంలో ఆదాయం కోల్పోవడమే కాకుండా బియ్యం ఎవరికీ కాకుండా పోతోంది.

ప్రభుత్వ ఖజానాకు గండి..

పేదలకు చెందాల్సిన రేషన్ బియ్యాన్ని దళారులు కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయిస్తున్నారు. కిలోకు రూ.12 చొప్పున కొంటున్నారు. పక్క రాష్ట్రాల్లో రూ.20పైచిలుకు ధరతో అమ్ముతున్నారు. లబ్ధిదారులతోపాటు రేషన్‌షాపుల్లో సేకరించిన ఈ బియ్యాన్ని అడ్డదారుల్లో రాష్ట్రం దాటించే ప్రయత్నంలో పట్టుబడుతున్నాయి. ఇలా స్వాధీనం చేసుకున్న బియ్యమే గోదాముల్లో పేరుకుపోతున్నాయి. రేషన్ షాపులపై, దళారులపై నిఘా పెట్టకపోయినప్పటికీ కనీసం సీజ్ చేసిన బియ్యంపై కూడా దృష్టిసారించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఫలితంగా ప్రభుత్వ ఖజానాకు భారీగానే గండిపడుతోంది. బియ్యాన్ని విక్రయించవద్దని ప్రచారం చేయకపోవడం, రేషన్‌షాపులను తనిఖీలు



చేయడంలో అలసత్వం ఇందుకు కారణం.

రోజూ ఏదో ఓ చోట

జనవరి నుంచి ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 16వేల క్వింటాళ్ల బియ్యం పట్టుబడింది. సిద్దిపేట జిల్లాలో 1,275 క్వింటాళ్లు సీజ్ చేసి 40 కేసులు నమోదు చేశారు. దాదాపు టాస్క్‌ఫోర్స్ పోలీసులే వీటిని ఛేదించారు. మెదక్ జిల్లాలో 290 క్వింటాళ్ల బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుంటే పలు సందర్భాల్లో పట్టుకున్నారు. అత్యధికంగా సంగారెడ్డి జిల్లాలో 14,446 క్వింటాళ్ల అక్రమ రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. ఈ జిల్లాలో నిత్యం ఏదో ఒక చోట బియ్యం పట్టుబడడం సాధారణమైంది. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు తరలించే క్రమంలో ఈ దందా బట్టబయలవుతోంది. వివిధ జిల్లాల్లో సేకరించిన బియ్యాన్ని సంగారెడ్డి జిల్లా మీదుగా తరలించడమే భారీ నిల్వలకు కారణంగా చెప్పవచ్చు. ఈ జిల్లాలోని నారాయణ్‌ఖేడ్, జహీరాబాద్, జోగిపేట, పటాన్‌చెరు, సంగారెడ్డి స్టాక్ పాయింట్లలో పెద్దఎత్తున అక్రమ బియ్యాన్ని నిల్వ చేశారు.

అనుమతులకూ ఎదురుచూపు

అక్రమ రేషన్ బియ్యాన్ని వేలం వేయాలంటే ఉన్నతాధికారుల నుంచి అనుమతులు రావాలని సంబంధిత అధికారులు చెబుతున్నారు. అయితే ఎప్పటికప్పుడు వేలం వేయడంతో పరిస్థితి ఇందాకా వచ్చేది కాదు. కానీ నెలల తరబడిగా జాప్యం చేయడంతోనే బియ్యం పాడవుతున్నాయి. సంబంధిత జిల్లా కలెక్టర్లు ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారిస్తే అక్రమ బియ్యాన్ని సక్రమంగా సద్వినియోగం చేసుకోవడం సులభమవుతుంది. లేదంటే ఇలాగే పేరుకుపోయి పురుగులకు, పందికొక్కులకు ఆహారమవుతుంది.

రెండు లారీల రేషన్ బియ్యం పట్టివేత

నారాయణఖేడ్, జూలై 16: హైదరాబాద్ నుంచి మహారాష్ట్రలోని నాందేడ్‌కు అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న రెండు లారీలను పట్టుకుని, ఇద్దరిని అరెస్టు చేసినట్లు సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి, పౌర సరఫరాల శాఖ డీటీ మహేష్‌కుమార్‌లు మంగళవారం తెలిపారు. ఇందుకు సంబంధించి వారు తెలిపిన వివరాలు.. హైదరాబాద్ నుంచి మహారాష్ట్రలోని నాందేడ్‌కు రెండు లారీల్లో అక్రమంగా పీడీఎస్ బియ్యం తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు సంగారెడ్డి - నాందేడ్ అకోలా 161 జాతీయ రహదారిపై మండల కేంద్రమైన నిజాంపేట వద్ద పోలీసులు, పౌరసరఫరాల శాఖ సిబ్బంది వాహనాల తనిఖీ చేపట్టారు. నాందేడ్ వైపు వెళ్తున్న రెండు లారీలను ఆపి తనిఖీ చేయడంతో ఒక లారీలో 300 క్వింటాళ్లు, మరో లారీలో 250 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడింది. మొత్తం 550 క్వింటాళ్ల బియ్యం రూ.12 లక్షల విలువ ఉంటుందని, వీటిని సీజ్ చేశామని వివరించారు. అలాగే, లారీ డ్రైవర్లు నాందేడ్‌కు చెందిన బాలాజీ, జుబేర్‌లను అరెస్ట్ చేశారు.



సిద్దిపేటలోని గోదాములో నిల్వ ఉన్న అక్రమ రేషన్ బియ్యం



మళ్లీ ఉపాధ్యాయుల సర్దుబాటు..!

- బదిలీలు, పదోన్నతులు జరిగినా..
- రిలీవర్ రాక ఎస్జీటీలు ఎక్కడి వారు అక్కడే
- జిల్లాలో 389 మంది పాత స్థానాల్లోనే..
- సర్దుబాటుకు జిల్లా విద్యాశాఖ కసరత్తు
- రెండు, మూడు రోజుల్లో ఉత్తర్వులు

సంగారెడ్డి అర్బన్, జూలై 16: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు జరిగినా.. ఈసారీ ఉపాధ్యాయుల సర్దుబాటు తప్పేలా లేదు. విద్యార్థులకు తగ్గట్టు టీచర్లు లేకపోవడంతో బోధనాపరమైన ఇబ్బందులను పరిష్కారం చూపేందుకు విద్యాశాఖ దిద్దుబాటు చర్యలు చేపట్టింది. విద్యార్థులు ఎక్కువగా ఉండి పనిభారం ఉన్న బడుల్లో సర్దుబాటు(వర్క్ అడ్జెస్ట్‌మెంట్) చేయాలని భావిస్తోంది. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా ఉపాధ్యాయుల సర్దుబాటుకు ఎంఈవోల నుంచి నివేదిక కోరారు. కొత్త నియామకాలు చేపట్టే వరకు ఇబ్బందులు లేకుండా చూసేందుకు ఇంతకు మించి మార్గం లేదని విద్యాశాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. జిల్లాలో ఇటీవల జరిగిన టీచర్ల పదోన్నతి, బదిలీలతో చాలా మందికి స్థాన చలనం కలిగింది. ఇందులో భాగంగా ప్రధానోపాధ్యాయులు 92 మంది బదిలీ కాగా, 72 మంది ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందారు. అదే విధంగా 777 మంది స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందగా, 850 మంది స్కూల్ అసిస్టెంట్లు బదిలీ అయ్యారు. ఇక 1,431 మంది ఎస్జీటీలు బదిలీ కాగా, వారిలో 1,042 మంది మాత్రమే స్థాన చలనం దక్కింది.

రిలీవర్లు రాక ఇబ్బందులు..

ఇటీవల జరిగిన టీచర్ల బదిలీల ప్రక్రియలో సెకండరీ గ్రేడ్ టీచర్లు(ఎస్జీటీ) బదిలీ అయినా.. వారి స్థానంలో ఇంకొకరు రాకపోతే వారిని రిలీవ్ చేయవద్దని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో సంగారెడ్డి జిల్లాలో 1,431 ఎస్జీటీ టీచర్లు బదిలీ అయినప్పటికీ రిలీవర్ రాకపోవడంతో 389 మంది ఎస్జీటీలను రిలీవ్ చేయలేదు. వారంతా పాత స్థానాల్లోనే కొనసాగుతున్నారు. డీఎస్సీ ద్వారా కొత్త టీచర్ల నియామకం జరిగి వారి స్థానంలో వస్తే తప్పా వారు బదిలీ అయిన స్థానానికి వెళ్లే అవకాశం లేదని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి.

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా..

ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో ప్రభుత్వం విద్యార్థుల సంఖ్య అనుగుణంగా టీచర్లను కేటాయించింది. 1 నుంచి 10 మంది విద్యార్థులున్న పాఠశాలకు ఒక టీచర్, 11 నుంచి 40 విద్యార్థులుంటే ఇద్దరు, 41 నుంచి 60 మంది ఉంటే ముగ్గురు, 61కిపైగా ఉంటే ఆ స్కూల్‌లో మంజూరైన అన్ని పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించి ఆ మేరకు చర్యలు చేపట్టింది. అయితే, బదిలీల్లో హేతుబద్ధీకరణ సక్రమంగా జరగలేదని ఉపాధ్యాయ సంఘాల ప్రధాన ఆరోపణ. హేతబద్ధీకరణ సరిగ్గా జరిగి ఉంటే విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఏకోపాధ్యాయ పాఠశాలతో పాటు ఇతర పాఠశాలల్లో కొత్త పోస్టులు మంజూరయ్యే అవకాశం ఉండేది. కొత్త పోస్టులు మంజూరు చేయకుండా, హేతుబద్ధీకరణ చేపట్టడం పట్ల ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి. అంతే కాకుండా జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూళ్ల పోస్టులు బదిలీల్లో చూపలేదు. జిల్లాలో ఏకోపాధ్యాయ పాఠశాలలు 230 ఉండగా, జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూళ్లు సుమారు 31 వరకు ఉండవచ్చని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి.

వంద మంది వరకు సర్దుబాటు

జిల్లాలో 1,262 ప్రభుత్వ పాఠశాలలుండగా, అందులో సుమారు లక్ష 20 వేల మంది విద్యనభ్యసిస్తున్నారు. జిల్లాలో 5,947 టీచర్ పోస్టుల మంజూరు ఉండగా, 5,079 మంది పనిచేస్తున్నారు. బదిలీలు, పదోన్నతుల తర్వాత కూడా సుమారు 868 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు విద్యాశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. డీఎస్సీ ద్వారా 551 టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశారు. డీఎస్సీ ద్వారా నియామకాలు ఆలస్యం కానున్న నేపథ్యంలో సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండి ఉపాధ్యాయుల లేని చోట్ల ఈ ఏడాది కూడా సర్దుబాటు చేయనున్నారు. గతేడాది సుమారు 180 మంది వరకు ఉపాధ్యాయులను వర్క్ అడ్జెస్ట్‌మెంట్, డిప్యూటేషన్‌పై ఇతర పాఠశాలలకు పంపినట్లు విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. ఈ ఏడాది కేవలం ఎస్జీటీలనే సర్దుబాటు చేయనున్నారు. ఉపాధ్యాయ నియామకాల్లో జాప్యం నేపథ్యంలో గత జనవరిలో సీఎం రేవంత్‌రెడ్డి ఉపాధ్యాయుల కొరత ఉన్న చోట విద్యావలంటీర్లను నియమిస్తామని ప్రకటించినా.. ప్రస్తుతం ఆ మాట వినిపించకపోవడంతో సర్దుబాటు తప్పని సరిగా మారింది. ఈ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ఎంఈవోల ద్వారా తీసుకున్న నివేదిక ఆధారంగా సుమారు వంద మంది వరకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేసే అవకాశం ఉందని, రెండు మూడు రోజుల్లో ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

జాడ లేని వాన

- ఊరిస్తున్న మబ్బులు.. జిల్లాలో లోటు వర్షపాతం
- ఇప్పటికీ 15 శాతం మించని వరినాట్లు
- ఆందోళనలో రైతాంగం

మెదక్, జూలై 16: వరుణుడి కరుణ చూపకపోవడంతో రైతులు దుక్కులు దున్ని దిక్కులు చూస్తున్నారు. వర్షాకాలం ప్రారంభమై నెల రోజులు దాటినా జిల్లాలో సరైన వర్షాలు కురవలేదు. దీంతో జిల్లావ్యాప్తంగా లోటువర్షపాతం నమోదైంది. జూలై 15 నాటికి 103 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 50 మిల్లీమీటర్లు మాత్రమే పడింది. ఫలితంగా భూగర్భ జలాలు పెరగడం లేదు సరికదా.. నానాటికీ తగ్గిపోతున్నాయి. దీంతో బోరు బావులపై ఆధారపడి సాగు చేద్దామన్నా వీలు కావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర రాజధానితో పాటు పలు జిల్లాలలో విస్తారంగా వర్షాలు కురుస్తుండగా, మెతుకు సీమలో రోజూ దట్టంగా మేఘాలు కమ్ముకోవడం, తర్వాత అవి కాస్త తేలి సూర్యుడు దర్శనమివ్వడం పరిపాటిగా మారింది. దీంతో వరుణుడి కరుణ కోసం ఊరూరా పూజలు చేస్తున్నారు. శివుడికి జలాభిషేకాలు చేస్తున్నారు.

రెండు నెలల ముందే దుక్కులు

ఈ వర్షాకాలం సీజన్‌లో విస్తృతంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ పరిశీలకులు తొలుత అంచనా వేశారు. దాంతో రైతులూ సంతోషంగా రెండు నెలల ముందే దుక్కులు దున్నుకుని వ్యవసాయ భూములను సాగుకు అనుగుణంగా సిద్ధం చేసుకున్నారు. భూసారం కోసం పచ్చిరొట్ట కొనుగోలు చేసేందుకు పలుచోట్ల దుకాణాల వద్ద క్యూలు కట్టారు. ఒక దశలో పచ్చిరొట్ట, జనుము విత్తనానికి జిల్లాలో కొరత ఏర్పడింది. ఎలాగైతేనేం.. వరి తూకాలు వేసి నాట్లకు సిద్ధమయ్యారు. కానీ, వాన దేవుడు మాత్రం జిల్లా రైతులపై కరుణ చూపడం లేదు. ఈ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 3,75,000 ఎకరాల విస్తీర్ణంలో పంటల సాగు జరుగుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అందులో వరి 3,10,000 ఎకరాలు, పత్తి 40 వేల ఎకరాలు, మిగతా మొక్కజొన్న, జొన్న, ఆరుతడి పంటలు వేసే అవకాశం ఉందని భావించింది. తీరా వర్షాలు లేక రైతులు ఆందోళన చెందుతున్నారు.

ముదురుతున్న వరినారు..

రైతులు సీజన్ ప్రారంభంలో వరి తూకాలు వేసుకోగా, వర్షాలు కురియడం ఆలస్యం అవుతుండడంతో నాట్లు వేయడం లేదు. ఓ వైపు వరినారు ముదిరిపోతోందని, మరో వైపు నాట్లు వేయడం ఆలస్యమైతే పంటకు చీడపీడలు సోకే ప్రమాదం ఉందని వాపోతున్నారు. కేవలం బోరుబావులపై ఆధారపడ్డ రైతులు మాత్రమే కొద్దిమేర ప్రస్తుతం వరి నాట్లు వేశారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికి 45వేల ఎకరాల విస్తీర్ణంలో కేవలం 15 శాతం మాత్రమే నాట్లు వేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. మంచి వర్షాల కోసం మిగతా రైతులు ఎదురుచూస్తున్నారు. సుమారు ఎనిమిది ఏళ్ల తర్వాత జిల్లాలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మోస్తరు వర్షం

మెదక్ అర్బన్, జూలై 16: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మెదక్, సంగారెడ్డి జిల్లాలోని పలు చోట్ల మంగళవారం వర్షాలు కురిశాయి. మెదక్ జిల్లాలోని కాగజ్ మద్దూర్‌లో 2.8 సెంటీమీటర్లు, టేక్మాల్ 1.9 సెం.మీ, పెద్దశంకరంపేట 1.7 సెం.మీ, కొల్చారం 1.6 సెం.మీ, సంగారెడ్డి జిల్లా కల్హేర్‌లో 1.5 సెం.మీ, సత్వార్ 1.3 సెం.మీ వర్షపాతం నమోదైంది.



ఖర్చులకు డబ్బులు ఇవ్వలేదని.. తండ్రిని చంపిన కుమారుడు



మారుతి(ఫైల్)

కంగ్టి, జూలై 16: ఖర్చుల కోసం డబ్బులు అడిగితే ఇవ్వలేదనే కోపంతో కన్నతండ్రిని కొడుకే గొడ్డలితో కొట్టి చంపిన విషాదకర ఘటన మంగళవారం సంగారెడ్డి జిల్లా కంగ్టి మండల పరిధిలోని చౌకన్‌పల్లిలో జరిగింది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. చౌకన్‌పల్లి గ్రామానికి చెందిన మొద్దె మారుతి(65)కు భార్య చంద్రమ్మతో పాటు కుమారుడు నర్సప్ప(21) ఉన్నారు. దినసరి కూలీ పని చేసి జీవనం సాగించే మారుతిని కొడుకు తరుచూ ఖర్చుల కోసమని డబ్బులు అడిగేవాడు. మంగళవారం మారుతి ఇంట్లో కూర్చొని అల్పాహారం చేస్తుండగా, కొడుకు వచ్చి మళ్లీ డబ్బులు అడగడంతో తండ్రి నిరాకరించాడు. దీంతో అక్కడే ఉన్న గొడ్డలితో తండ్రిపై దాడి చేశాడు. దీంతో తీవ్రంగా గాయపడిన మారుతిని చికిత్స కోసం సంగారెడ్డి వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మారుతి సోదరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ సీజీఎంతో మాట్లాడుతున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

ఓడీఎఫ్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- మెదక్ ఎంపీ రఘునందన్ రావు

కంది, జూలై 16: సంగారెడ్డి జిల్లా కంది మండలం ఎద్దుమైలారంలోని ఓడీఎఫ్ (ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ) సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. మంగళవారం ఆయన ఆర్డినెన్స్ ఫ్యాక్టరీని సందర్శించారు. అక్కడి ఇన్‌స్పెక్షన్ బంగ్లాలో సీజీఎం శివశంకరప్రసాద్, జీఎంలతోపాటు ఇతర ప్రతినిధులతో ఎంపీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ ఓడీఎఫ్ సమస్యలను కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు వివరిస్తానన్నారు. కార్మికులకు పనిభారం, ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగుల సమస్యలు, చనిపోయిన కార్మికుల కుటుంబాలకు వచ్చే ప్రయోజనాలతో పాటు ఇతర సమస్యలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్తానని వెల్లడించారు. సమావేశంలో హెచ్‌ఆర్ జీఎం విజయదత్, బీజేపీ నాయకులు కే.జగన్, నర్సింహ్మారెడ్డి, బాల నర్సయ్య, ఈశ్వరయ్య, జితేందర్ గౌడ్, గోపాల్, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొహర్రం ప్రశాంతంగా జరుపుకోవాలి

- మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



మెదక్ అర్బన్, జూలై 16: మొహర్రం ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే శాంతి కమిటీ సమావేశాలు నిర్వహించామని, ఉత్సవాల నిర్వాహకులు, కమిటీలు పోలీసుల సూచనలు పాటించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా అందరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. మొహర్రం ఊరేగింపు ప్రశాంతంగా ముగిసే వరకు నిర్వాహకులకు సహకరిస్తూ.. సిబ్బంది కృషి చేయాలన్నారు. పోలీసులు బందోబస్తు సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, సెక్టార్ వైజ్‌గా ఎవరికీ కేటాయించిన స్థానాల్లో వారే విధులను నిర్వర్తించాలన్నారు. ప్రజలు ఎలాంటి వదంతులను నమ్మవద్దని, సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెడితే వారిపై చర్యలు ఉంటాయన్నారు.

ఎరువులను మోతాదులో పిచికారీ చేయాలి

● మెదక్ జిల్లా వ్యవసాయధికారి గోవింద్



గవ్వలపల్లి ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్

చిన్నశంకరంపేట, జూలై 16: రైతులు పంటల సాగుకు మోతాదుకు మించకుండా ఎరువులను పిచికారీ చేయాలని జిల్లా వ్యవసాయాధికారి గోవింద్ అన్నారు. మంగళవారం చిన్నశంకరంపేట మండల కేంద్రంతో పాటు గవ్వపల్లి, మదూర్ గ్రామాల్లోని డీసీఎంఎస్, పీఏసీఎస్, ఆగ్రోస్ కేంద్రాలను సందర్శించి వాట్సాప్ మొబైల్ యాప్, ఎరువులకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించి మాట్లాడారు. ప్రతీ వారం ఐదు ఎరువులు, క్రిమి సంహారక మందుషాపులను ఏవో, ఏఈవోలు తనిఖీ చేస్తారన్నారు. ఎరువుల దుకాణ డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలన్నారు. ఆయన వెంట ఏవో లక్ష్మీ, ప్రవీణ్ ఉన్నారు.

పత్తి పంట సాగుపై రైతులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ

పుల్‌కల్, జూలై 16: మండలంలోని గొంగ్లూరు గ్రామంలో పత్తిపంట సాగుపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. స్థానిక రైతువేదిక భవనంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సంగుపేట ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాహుల్‌విశ్వకర్మ హాజరై వరి, పత్తి తదితర పంటల సాగుపై రైతులు ఎప్పటికప్పుడూ మెళకువలు తీసుకోవాలని సూచించారు. వరి నారుమడి దశలో ఉన్నందున ప్రధాన పొలంలో నాటేముందు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఎకరాకు సరిపడా నారుమడిలో 800 గ్రాములు వేసుకోవాలని, తద్వారా కాండం తొలిచే పురుగు నివారించబడుతుందన్నారు. కలుపు నివారణకు వరి, నారుమడిలో ఒకటి, రెండురోజుల్లోపు క్లించర్ (సైహలోపాప్-పి-బ్యుటైల్) 1.5 మిల్లీ లీటర్లు, నామిని గోల్డ్ (బిస్ పైరిబాక్ సోడియం) 0.5 మిల్లీ లీటర్లు వినియోగించాలని సూచించారు.

ఎంఎస్‌పీకి చట్టబద్ధత కల్పించాలి

● తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు కాసాల రాఘవేందర్‌రెడ్డి

సంగారెడ్డి అర్బన్, జూలై 16: స్వామినాథన్ కమిటీ సూచన ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేసిన ఎంఎస్‌పీ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి, ప్రకటించిన ఎంఎస్‌పీకి చట్టబద్ధత కల్పించాలని తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు కాసాల రాఘవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సంగారెడ్డిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఏర్పడి 10 ఏళ్లు గడిచినా ఏ ఒక్క రైతు కుటుంబం పేరు మీద కనీసం 10 వేల బ్యాంక్ డిపాజిట్లు లేకపోవడం రైతుల దుస్థితికి నిదర్శనమన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నటువంటి పరిస్థితుల్లో రైతులకిచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీ, రైతుభరోసా, పంటల బీమా తదితర వాటిని మొదటి ప్రాధాన్యతతో సుమారు 42 వేల కోట్లు మంజూరు చేయడానికి నిర్ణయించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు రాంరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నర్సింహులు, వెంకటేశ్వర్, మల్లేశం, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లులో విజిలెన్స్ తనిఖీలు

● వరిధాన్యం నిల్వలు, రికార్డుల పరిశీలన



రామాయంపేట మిల్లులో అధికారుల తనిఖీలు

రామాయంపేట, జూలై 16: రైస్ మిల్లులో ప్రభుత్వానికి సంబంధించిన ధాన్యం నిల్వలు సరిగ్గా ఉన్నాయా.. లేవా అన్న దానిపై అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ మేరకు రామాయంపేట మండల పరిధి కోనాపూర్ మిల్లులో మంగళవారం టాస్క్‌ఫోర్స్, విజిలెన్స్ బృందం రికార్డులు పరిశీలించింది. అనంతరం ధాన్యం నిల్వలను చూశారు. విజిలెన్స్ ఎస్‌ఐ పుల్లయ్య నేతృత్వంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సీఎంఆర్ షీట్ ప్రకారంగా బియ్యం, వరి బస్తాల లెక్కలు చూస్తున్నామన్నారు. ఏమైనా తేడా ఉన్నట్లు తేలితే సంబంధిత కమిషనర్‌కు నివేదిక అందజేస్తామన్నారు.

తూప్రాన్‌లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్



16వ వార్డులో డ్రైనేజీని శుభ్రం చేస్తున్న సిబ్బంది

తూప్రాన్, జూలై 16: తూప్రాన్ పట్టణ మున్సిపల్ పరిధి 16వ వార్డులో మంగళవారం వానాకాలం పురస్కరించుకుని స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేపట్టారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతికృష్ణ ఆధ్వర్యంలో వార్డులో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. వీధుల్లో ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ప్రజల సమస్యలు తెలుసుకుంటూ.. వాటి పరిష్కారానికి కృషి చేశారు. ఈ కార్యక్రమంలో 16వ వార్డు కౌన్సిలర్ కొడిప్యాక నారాయణగుప్తా, కమిషనర్ ఖాజా మొహిజుద్దీన్, కౌన్సిలర్లు శ్రీశైలంగౌడ్, రాజు పాల్గొన్నారు.

కోహీర్‌లో 'రైతునేస్తం' ట్రయల్ రన్

కోహీర్, జూలై 16: మండల కేంద్రమైన కోహీర్‌లోని రైతువేదికలో వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం రైతునేస్తం కార్యక్రమానికి ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి నవీన్ కుమార్ మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ ఫ్లాట్ ఫారం విధానం ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్నదన్నారు. రైతునేస్తం కార్యక్రమం ద్వారా వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సమస్యలపై రైతులతో చర్చిస్తారన్నారు. గ్రామాల నుంచే రైతులు ఆన్‌లైన్‌లో తమ పంటలకు సంబంధించిన సలహాలు, సూచనలు అందుకోవటం, తమ అనుభవాలను ఇతర రైతులతో పంచుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ భిక్షపతి, మండల వ్యవసాయ అధికారి నవీన్‌కుమార్, ఏఈవోలు శ్రీనివాస్, వేదవతి, మౌనిక, సవిత, స్వాతి, ఆత్మ బీటీఎం చరణ్ తదితరులు పాల్గొన్నారు.



రైతు నేస్తం ట్రయల్ రన్‌కు హాజరైన రైతులు



అక్కన్నపేట మండలంలోని మల్చెరువుతండాలో నెత్తిన నైవేద్యంతో గిరిజన యువతులు, మహిళలు(ఫైల్)

సంస్కృతికి ప్రతీక సీత్లా

- ఆషాఢమాసం నుంచి శ్రావణమాసం మధ్యన ఉత్సవాలు
- గిరిజన తండాల్లో ప్రారంభమైన వేడుకలు

అక్కన్నపేట, జూలై 16: గిరిజన తండాల్లో సీత్లా భవానీ(దాటుడు) పండుగ సందడి మొదలైంది. గిరిజనుల సంస్కృతికి ప్రతీకైన ఈ పండుగను ప్రతిఏటా ఆషాఢమాసం నుంచి శ్రావణమాసం మధ్యన పెద్ద పూసాల కార్తెలో అమ్మవారికి ఇష్టమైన మంగళవారం రోజున నిర్వహించుకోవడం తాత ముత్తాతల కాలం నుంచి వస్తున్న ఆనవాయితీ. గిరిజనుల పశుసంపద రక్షణ కోసం, వర్షాలు సకాలంలో కురిసి పంటలు బాగా పండాలని ప్రాచీన కాలం నుంచి జరుపుకునే పండుగ సీత్లా ఉత్సవం. ఈ వేడుకను గిరిజనులు ప్రత్యేక భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలోని గిరిజనతండాల్లో సీత్లా సందడి ప్రారంభమైంది. ఈ పండుగను దాటుడు పండుగగా గిరిజనులు పిలుస్తారు.

లాళీ(గాలికుంటువ్యాధి)లతో ముప్పు

పశుపోషణకు మారుపేరైన గిరిజనులు పూర్వ కాలం నుంచి వందల సంఖ్యలో పశుసంపదను కలిగి ఉండేవారు. పశువులకు గడ్డి బాగా లభించే ప్రాంతాలను ఎంచుకొని తండాలుగా ఏర్పాటు చేసుకుని అక్కడే జీవనం సాగించేవారు. గ్రామాలకు దూరంగా అడవుల్లో నివసించడంతో వాతావరణంలో మార్పులు వచ్చినప్పుడల్లా పశువులు రోగాల బారినపడేవి. వర్షాకాలం మొదలుకాగానే తండాల్లోని పశువులు వందల సంఖ్యల్లో మరణించేవి. జ్వరం, విరేచనాలు, కాలుడెక్కలు చెడిపోవడం, నోరుచెడి మేత మేయకపోవడం వంటి లక్షణాలతో పశువులు ప్రాణాలు కోల్పోయేవి. ఈ జబ్బులను గిరిజనులు అప్పట్లో లాళీ (గాలికుంటు వ్యాధి)గా పిలిచేవారు.

గిరిజన పెద్ద కలలో కనబడ్డ సీత్లా దేవత

పశుసంపద మరణిస్తూ బాధపడుతున్న తరుణంలో పూర్వం ఓ గిరిజన పెద్ద కలలో గిరిజనుల ఏడుగురు దేవతల్లో చిన్నదైన సీత్లా భవానీ దేవత కనిపించి తనను పూజిస్తే పశుసంపద దక్కుతుందని చెప్పడంతో అప్పటి నుంచి గిరిజన తండాల్లో ఈ పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. గిరిజనులు ఇళ్లల్లో కాకుండా తండా చివరలో ఏడుగురు అక్కాచెల్లెళ్లయిన (తుల్జా భవానీ, దుర్గా భవానీ, హీంగ్లా భవానీ, అంబ భవానీ, గండి భవానీ, మత్రా భవానీ, సీత్లా భవానీ) దేవతల ప్రతిమలను పొడవాటి రాళ్లతో తయారుచేసి ఒకే వరుసలో ప్రతిష్ఠించి వాటికి ఎదురుగా వంద అడుగుల దూరంలో లుంకడ్యా ప్రతిమను ఏర్పాటు చేస్తారు. ఏడుగురు అమ్మవార్లలో చిన్నదైనా సీత్లా భవానీ పేరిట పండుగ నిర్వహిస్తారు. అమ్మవారికి ప్రీతిపాత్రమైన మంగళవారం అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు తీర్చుకుంటే తమ పశు సంపదకు ఎలాంటి హాని జరగదని గిరిజనుల నమ్మకం.

కన్నె పిల్లలు ఇచ్చే నైవేద్యం

సీత్లా భవానీ ప్రతిమలను జాజు, పూలు, మామిడాలకులతో అలంకరిస్తారు. ఒకరోజు ముందు జొన్నలు, పప్పుధాన్యాలను నానబెట్టి తయారుచేసిన ఘుగ్రి (గుగ్గిళ్లను) సమర్పిస్తారు. దీన్ని గిరిజనులు వాంసిడో (ప్రాచిన నైవేద్యం)గా చెబుతారు. వాంసిడోను పెళ్లి కాని యువతులు తమ ఇళ్ల నుంచి తీసుకొచ్చి సీత్లా భవానీలకు సమర్పించడం ఆనవాయితీ.

పశువులపై చల్లడానికి ప్రత్యేక పదార్థం

ప్రత్యేక పూజలు చేసిన అనంతరం గిరిజనులు గొర్రెపోతులు, మేకలను బలి ఇచ్చేటప్పుడు వచ్చే రక్తం, ఉడకబెట్టిన గుడాలు కలిపి ప్రత్యేక పదార్థం తయారుచేస్తారు. బలి ఇచ్చిన గొర్రె, మేకల పేగులను దేవతా ప్రతిమల నుంచి లుంకడ్యా ప్రతిమ వరకు పరుస్తారు. వాటి మీద నుంచి పశువులను దాటిస్తూ ప్రత్యేకంగా తయారుచేసిన పదార్థాన్ని పశువులపై చల్లుతారు. ఇలా దీన్ని దాటుడు పండుగగా పరిగణిస్తారు. ఆషాఢ మాసంలో ఒక్కొక్క మంగళవారం ఒక్కొక్క తండాలో సీత్లా భవానీ పండుగను గిరిజనలు జరుపుకుంటున్నారు.



ధూళిమిట్ట మండలం సిబ్బితండాలో సంప్రదాయ వేషధారణలో గిరిజన మహిళలు

ఘనంగా సీత్లా భవానీ ఉత్సవాలు

అక్కన్నపేట/ధూళిమిట్ట, జూలై 16: అక్కన్నపేట మండలంలోని కపూర్‌నాయక్‌తండా, తుక్కుతండా, పూసలతండా, దేవులనాయక్‌తండా, దూద్యనాయక్‌తండా, పంతులుతండా గ్రామపంచాయతీ పరిధిలోని దేవుతండా, పెద్దతండాల్లో గిరిజనులు మంగళవారం సీత్లాభవానీ ఉత్సవాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా గిరిజనులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అలాగే ధూళిమిట్ట మండలంలోని హనుమతండా గ్రామపంచాయతీ పరిధిలోని సిబ్బితండాలో మంగళవారం సీత్లా భవానీ పండుగను గిరిజనులు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇస్లావత్ చిరంజీవి, భూక్య జగన్, నాగవత్ మోహన్, భూక్య పరిష, భూక్య మోహన్, ధరావత్ తవురియా, భూక్య రాజు, జాటోత్ నవీన్ పాల్గొన్నారు.

సెలవు దినంగా ప్రకటించాలి



రాష్ట్రవ్యాప్తంగా అన్ని గిరిజన తండాల్లో ఒకేరోజు సీత్లా భవానీ పండుగ జరుపుకోవాలి. అందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని గిరిజనుల పెద్దలతో సమావేశం నిర్వహించాలి. ప్రతి సంవత్సరం జూలైలో వచ్చే పెద్ద పూసాల కార్తెలో మొదటి లేదా రెండో మంగళవారంలో ఒక తేదీని నిర్ణయించాలి. ఆరోజు ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించాలి. ప్రతి సంవత్సరం ప్రభుత్వానికి వినతిపత్రాలు ఇస్తున్నా పట్టించుకోవడం లేదు.

- నూనవత్ మోహన్ నాయక్, గిరిజన సంఘాల జిల్లా నాయకులు, అక్కన్నపేట



పంజగుట్టతండాలో నృత్యాలు చేస్తున్న గిరిజన మహిళలు(ఫైల్)



పెద్దతండాలో అమ్మవారికి మొక్కులు చెల్లిస్తున్న గిరిజనులు(ఫైల్)

భార్యాపిల్లలతో గొడవపడి ఆత్మహత్య

దుబ్బాక, జూలై 16: తాగి ఎందుకు వస్తున్నావని నిలదీసిన భార్య, కూతురుతో గొడవపడిన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అక్బర్‌పేట-భూంపల్లి మండలం బొప్పాపూర్ గ్రామానికి చెందిన వనమా పరశురాములు(51) తరచూ ఇంటికి తాగివచ్చేవాడు. గత ఆదివారం కూడా తాగొచ్చిన పరశురాములు భార్య బుజ్జి, కూతురు మంగతో గొడవపడ్డాడు. ఇంటిపక్కన గల పెద్దలు రాగులు నారాగౌడ్, ఎండీ సాబేరా పరశురాములు మందలించడంతో.. ఇకనుంచి తాగి రానని ఒప్పుకున్నాడు. అయితే అదేరోజు సాయంత్రం ఇంటిని వెళ్లిన పరశురాములు తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా మంగళవారం ఉదయం పల్లె ప్రకృతివనం వద్ద కుమారుడు అనిల్‌కు తండ్రి బైక్ కనిపించింది. లోపలికి వెళ్లి చూడగా పరశురాములు చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. భార్య ఫిర్యాదు మేరకు భూంపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ధిక్కార స్వరం మూగబోయింది

- విశ్రాంత ఆచార్యులు కారంపురి సుభాష్ కన్నుమూత



కారంపురి సుభాష్(ఫైల్)

దుబ్బాక, జులై 16 : దొరతనాన్ని ప్రశ్నించిన ధిక్కార స్వరం మూగబోయింది. దుబ్బాకకు చెందిన కాకతీయ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్య డాక్టర్ కారంపురి సుభాష్ మంగళవారం రాత్రి హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో కన్నుమూశారు. దుబ్బాక పట్టణానికి చెందిన ఆయన విద్యార్థి దశలో దుబ్బాక దొరలపై ధిక్కార స్వరం వినిపించి, ఒక దొర భవనం ముందు తుపాకీ గొట్టంకు ఎదురుగా నిలబడి, బానిసత్వంను ప్రశ్నించారు. ఆయన దుబ్బాక వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘంలో జరిగిన అవినీతిపై 1962లో గోడలపై రాసి, ప్రశ్నించి, అప్పటి రాజకీయ నాయకుల బహిష్కరణకు గురై గ్రామం విడిచారు. హైదరాబాద్‌లో విద్యాభ్యాసం పూర్తి చేసి, తెలంగాణ ఉద్యమంలో కూడా కీలకంగా పని చేశారు. వరంగల్ కాకతీయ యూనివర్సిటీ ఆచార్యులుగా పని చేసిన ఆయన 2009లో ఉద్యోగ విరమణ పొందారు. దుబ్బాకలో 'మేమున్నాం' అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఆయన కుమారులు సుజయ్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో ఐటీ ఎలక్ట్రో డైరెక్టర్‌గా పని చేశారు. అంతేగాక వివిధ దేశాలనుంచి పెట్టుబడులు సాధించడానికి కృషి చేశారు. ప్రస్తుతం ఆయన షార్ప్ ఇంటర్‌నేషనల్ సంస్థ భారత విభాగంలో సీఈఓగా పని చేస్తున్నారు. రెండవ కుమారుడు సుశీల్ ఐటీ కంపెనీలను నిర్వహిస్తున్నారు. ఆయన సతీమణి శశికళ కూడా ఉపాధ్యాయురాలు, అధ్యాపకురాలుగా పని చేసి ఉద్యోగ విరమణ పొందారు. అయన మృతి పట్ల పలువురు సంతాపం ప్రకటించారు. ఆయన అంత్యక్రియలు బుధవారం దుబ్బాకలో నిర్వహించనున్నారు.

ప్రతి పరిశ్రమలో టీబీ నివారణ కార్యక్రమాలు

- జిల్లా పరిశ్రమల శాఖ జీఎం ప్రశాంత్‌కుమార్

సంగారెడ్డి అర్బన్, జూలై 16: జిల్లాలోని ప్రతి పరిశ్రమలో టీబీ నివారణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ డి.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. సంగారెడ్డిలోని ఓ ప్రైవేటు హోటల్‌లో మంగళవారం ఐ యాం ఫర్ టీబీ ప్రాజెక్టులో భాగంగా టీబీ అలర్ట్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతీ పరిశ్రమలో టీబీ కార్యక్రమాలు నిర్వహిచాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. టీబీ నిర్మూలన సామాజిక బాధ్యతగా తీసుకోవడం ద్వారా చాలా కుటుంబాలను రక్షించిన వారమవుతామన్నారు. జిల్లా టీబీ ప్రోగ్రాం ఆఫీసర్ డా.రాజేశ్వరి మాట్లాడుతూ పరిశ్రమలలో పనిచేస్తున్న వారందరూ ఒకచోట ఉండి పనిచేయడం ద్వారా టీబీ ఒకరి నుంచి మరొకరికి సోకే ప్రమాదం ఎక్కువగా ఉంటుందన్నారు. టీబీ వచ్చినంత మాత్రానా కార్మికుడిని పనిలోంచి తీసేయాల్సిన అవసరం లేదని, వారికి తగిన సహకారం అందిస్తే వ్యాధి పూర్తిగా నయం చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో టీబీ అలెర్ట్ ప్రాజెక్టు సిబ్బంది పురుషోత్తం, కృష్ణ, శ్రీకాంత్, టీబీ విభాగం సిబ్బంది చెన్నయ్య, శ్రీనివాస్, దేవేందర్, నర్సిరెడ్డి, అరుణ పాల్గొన్నారు.

నర్సాపూర్ ప్రాంతీయ ఆస్పత్రిలో కాయకల్ప బృందం తనిఖీ

నర్సాపూర్, జూలై 16: నర్సాపూర్ ప్రాంతీయ ఆస్పత్రిని మంగళవారం కాయకల్ప బృందం తనిఖీ చేసింది. బృందంలోని డాక్టర్లు యాదయ్య, విజయలక్ష్మి, సాయి ఆస్పత్రిలో అందుతున్న వైద్యసేవలతో పాటు శానిటేషన్, పచ్చదనం, రోగుల పట్ల సిబ్బంది తీరు, తదితర అంశాలను పరిశీలించారు. తనిఖీలో భాగంగా ఇక్కడి సేవలను నమోదు చేసుకుని రాష్ట్రస్థాయిలో నివేదిక ఇస్తారు. రాష్ట్రస్థాయిలో పరిశీలించి సేవలకు తగ్గట్టు నిధులు కేటాయిస్తారని బృందం పేర్కొంది. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పావని ఆస్పత్రిలోని సదుపాయాలు వివరించారు.

పంచాయతీ కార్యదర్శుల బదిలీలకు కౌన్సెలింగ్

సంగారెడ్డి టౌన్, జూలై 16: సంగారెడ్డి జిల్లాలో గ్రామపంచాయతీ కార్యదర్శుల బదిలీల ప్రక్రియ కొనసాగుతున్నది. ఈ నెల 5వ తేదీ నుంచి ప్రారంభమైన బదిలీల ప్రక్రియ 20తో ముగియనున్నది. ఇందులో భాగంగానే మంగళవారం అర్హులైన పంచాయతీ కార్యదర్శులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా పంచాయతీ అధికారి తాండ్రె సాయిబాబాలు కౌన్సెలింగ్ జరిపారు. జిల్లాలో మొత్తం 647 గ్రామపంచాయతీలకుగాను 639 మంది పంచాయతీ కార్యదర్శులున్నారు. 2014లో నియామకమైన 428 మంది కార్యదర్శుల్లో 347 మందికి రెగ్యులర్ అయ్యింది. నాలుగేళ్లు పూర్తయిన కార్యదర్శుల్లో 40 శాతం మందికి సీనియారిటీ ప్రాతిపదికన బదిలీల ప్రక్రియ చేపట్టారు. అర్హులైన పంచాయతీ కార్యదర్శుల నుంచి ఈ నెల 12వ తేదీవరకు దరఖాస్తులను స్వీకరించారు. వీరందరికి 18వ తేదీవరకు కౌన్సెలింగ్‌ను పూర్తిచేసి 19,20 తేదీల్లో బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులను కలెక్టర్ క్రాంతి వల్లూరు జారీ చేయనున్నారు.

పాఠశాల సమయాల్లో 'వీడ్కోలు' వద్దు: డీఈవో

సంగారెడ్డి అర్బన్, జూలై 16: జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పాఠశాల సమయం ముగిసిన తర్వాతనే వీడ్కోలు సమావేశాలు జరుపుకోవాలని డీఈవో వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల సమయాల్లో ఎటువంటి పార్టీలు చేపట్టరాదని సూచించారు. ఈనెల 12న కలెక్టర్ వల్లూరు క్రాంతి పటాన్‌చెరు మండలం రామేశ్వరం బండ గ్రామాన్ని సందర్శించిన సందర్భంగా ఎంపీపీఎస్‌లో పాఠశాల వేళలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుల వీడ్కోలు పార్టీ నిర్వహించారని, తద్వారా గ్రామస్థులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారని ఆమె దృష్టికి రావడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం సర్క్యులర్ జారీ చేసినట్లు తెలిపారు. కావున విద్యార్థులు, గ్రామస్థులకు అసౌకర్యం, ఆటంకం కలగకుండా పాఠశాల సమయం ముగిసిన తర్వాతే ఫెయిర్ వెల్, ఇతర కార్యక్రమాలు నిర్వహించుకోవాలని డీఈవో జారీచేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పరిశోధనలో జవాబుదారీతనం ఆవశ్యం

- గీతం ఆతిథ్య ఉపన్యాసంలో బార్క్ పూర్వ శాస్త్రవేత్త డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని



డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని ఆతిథ్య ఉపన్యాసం

పటాన్‌చెరు రూరల్, జూలై 16: పరిశోధనలో జవాబుదారీతనం ఆవశ్యమని, పరిశ్రమ అవసరాలను అర్థం చేసుకుని, ఆచరణాత్మక పరిష్కారాలను అభివృద్ధి చేయడంపై దృష్టి సారించాలని బాబా అణు పరిశోధనా సంస్థ పూర్వ శాస్త్రవేత్త, ముంబైచి విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ కె.ఇందిరా ప్రియదర్శిని సూచించారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లోని రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'సాంకేతికశాస్త్రం అభివృద్ధికి ప్రాథమిక పరిశోధన-రసాయ, జీవశాస్త్రాల సమన్వయంలో సవాళ్లు, అవకాశాలు' అనే అంశంపై మంగళవారం ఆమె అతిథ్య ఉపన్యాసం చేశారు. రసాయన, జీవశాస్త్ర రంగాల్లో ప్రాథమిక పరిశోధన, సాంకేతిక అభివృద్ధిపై ఆమె విలువైన అంతర దృష్టిలను అందించడంతో పాటు కర్క్యుమిన్, సెలినియంలపై తన పరిశోధనా ఫలితాలను సదస్సులతో పంచుకున్నారు. పరిశోధకులు సృజనాత్మకంగా యోచించాలని, ప్రాజెక్టులను ఇతరుల సహకారంతో చేపట్టాలని, వినూత్న ఆలోచనలను ప్రత్యక్ష ఉత్పత్తులుగా మార్చి, మేధో హక్కులను పొందడం లక్ష్యంగా పెట్టుకోవాలని ఆమె సూచించారు. ప్రశ్నలను అడగమని ప్రోత్సహిస్తూ, వాటికి వివరణాత్మక జవాబులిచ్చారు. తొలుత, రసాయనశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గౌసియాబేగం అతిథిని సదస్సుకు పరిచయం చేసి, ఇతర సహోధ్యాపకులతో కలిసి సత్కరించారు. తరువాతి తరం పరిశోధకులను వినూత్నంగా ఆలోచించేలా, పనిలో శ్రేష్ఠత కోసం ప్రయత్నించేలా ప్రేరేపించేలా సాగిన ఈ ఆతిథ్య ఉపన్యాసంలో పలువురు అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య దేశాభివృద్ధికి దోహదం

- సినీ నటుడు సుమన్



మొక్క నాటుతున్న సుమన్

కొండపాక, జూలై 16: క్రమశిక్షణ, సంస్కృతి, విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందిస్తే.. అది దేశాభివృద్ధికి దోహదపడుతుందని సినీనటుడు సుమన్ అన్నారు. సిద్దిపేట జిల్లా కొండపాక శివారులోని సత్యసాయి ప్రశాంతి నికేతనం కళాశాల ఆవరణలో మంగళవారం మొక్కలు నాటి విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. తల్లి, తండ్రి లేని పిల్లలకు, నిరుపేద కుటుంబాల పిల్లలకు విద్యా, వైద్యం, పోషకాహారం అందిస్తున్న సద్గురు మధుసూదనసాయి అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించి సంస్కృతీ, సంప్రదాయాలు, విద్య తోపాటు కళలు, సంగీతం తదితర అంశాలను అందిస్తూ వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపుతున్న కళాశాల యాజమాన్యాన్ని అభినందించారు. విద్యార్థులు, ప్రతీ మహిళ మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొంది ఆత్మస్థైర్యంతో నిలబడాలన్నారు. ఎమ్మెస్సీ మేథమాటిక్స్‌లో గోల్డ్‌మెడల్ సాధించిన దివ్యభారతిని సుమన్ శాలువా కప్పి అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన భక్తి గీతాల నృత్యాలు అలరించాయి. అనంతరం సుమన్‌ను కళాశాల చైర్‌పర్సన్ పూర్ణిమశంకర్, కార్యదర్శి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్ సునయన, డిప్యూటీ చైర్‌పర్సన్లు రేష్మ కుందర్, మానస, కార్యదర్శి శంకర్ అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో పాటు చదువులోనూ రాణించాలి: మున్సిపల్ చైర్‌పర్సన్



సిద్దిపేటలోని ఫుట్‌బాల్ మైదానంలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మంజులారాజనర్సు

సిద్దిపేట టౌన్, జూలై 16: క్రీడలతో పాటు చదువులో కూడా రాణించి, మీ తల్లిదండ్రులకు, మీ కోచ్‌లకు మంచిపేరు తీసుకరావాలని సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారాజనర్సు సూచించారు. మంగళవారం సిద్దిపేటలోని ఫుట్‌బాల్ మైదానంలో తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్, సిద్దిపేట ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-17 బాలికల ఫుట్‌బాల్ జట్టు క్రీడాకారుల శిక్షణా శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పట్టణంలో అన్ని క్రీడలను ఉత్తేజపరుస్తూ, క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, సిద్దిపేట ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అక్బర్‌నవాబ్, కౌన్సిలర్ మల్లికార్జున్, బీఆర్ఎస్ నాయకులు దరిపల్లి శ్రీనివాస్, కోచ్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని మహిళ మృతి

- ఘటన జరిగి ఆరురోజులైనా స్పందించని పోలీసులు
- పోలీస్‌స్టేషన్ ఎదుట కుటుంబసభ్యులు, గ్రామస్థుల ఆందోళన



లక్ష్మి(ఫైల్)



పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేపడుతున్న మృతురాలి కుటుంబసభ్యులు, గ్రామస్థులు

వెల్దుర్తి, జూలై 16: ద్విచక్ర వాహనం ఢీకొని గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినా నిందితుడిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో బాధిత కుటుంబసభ్యులు, గ్రామస్థులు మంగళవారం పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. వెల్దుర్తి మండలం ధర్మారం గ్రామానికి చెందిన బర్ల లక్ష్మి(52) తన కోడలు జ్యోతితో కలిసి గురువారం పని నిమిత్తం వెల్దుర్తి పట్టణానికి వచ్చింది. స్థానిక బాలాజీ ఆస్పత్రి వద్ద పట్టణానికి చెందిన సల్మాన్ అనే యువకుడు ద్విచక్ర వాహనంతో లక్ష్మిని ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. చికిత్స నిమిత్తం ఆమెను హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. ఘటనకు సంబంధించి పోలీస్‌స్టేషన్‌లో బాధిత కుటుంబసభ్యులు గత శనివారం ఫిర్యాదు చేశారు. ఘటన జరిగి ఆరురోజులు గడవగా, ఫిర్యాదు చేసి నాలుగు రోజులు గడిచినా పోలీసులు నిందితుడిని కానీ, బైక్‌ను కానీ స్వాధీనం చేసుకోకపోవడంతో బాధిత కుటుంబసభ్యులు, గ్రామస్థులు పోలీస్‌స్టేషన్ ఎదుట మంగళవారం ఆందోళన చేపట్టారు. ఎస్ఐ నవతాగౌడ్, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం బాధిత కుటుంబసభ్యులు, గ్రామస్థులు మాట్లాడుతూ.. చిన్న చిన్న ఫిర్యాదులపై ఫోన్‌చేసి పిలిచే పోలీసులు.. ఒక మహిళ మృతిచెందినా ఎందుకు పట్టించుకోవడం లేదని ఎస్ఐని నిలదీశారు. వెల్దుర్తికి చెందిన పలువురు నాయకులతో కుమ్మక్కై ఎస్ఐ నవతాగౌడ్ నిందితుడికి అండగా నిలిచారని ఆరోపించారు. ఇదిలా ఉండగా ఎస్ఐ నవతాగౌడ్ తూప్రాన్ సర్కిల్ పరిధిలోని పలు పోలీస్‌స్టేషన్ల నుంచి పోలీసులను బందోబస్తుకు పిలవడంపై బాధితులు అనుమానం వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేసే ఉద్దేశం లేకనే బెదిరింపులకు గురిచేసేందుకు ముందస్తు బందోబస్తును ఎస్ఐ పిలిచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీస్ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు తమకు న్యాయం చేయాలని, లేకపోతే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కాగా మృతురాలి భర్త కిషన్, కుమారుడు శేఖర్ గతంలోనే మృతిచెందారు. కోడలు జ్యోతి, మనుమడు ఆదిత్య ఉన్నారు. ఘటనకు కారణమైన యువకుడిని బుధవారం పిలుస్తామని పోలీసులు హామీఇవ్వడంతో ఆందోళన విరమించారు.

నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు

- గ్రామాల్లో రోడ్లపైనే చెత్తాచెదారం
- ప్రజాధనం వృథా
- పట్టించుకోని అధికారులు



నిరుపయోగంగా ఉన్న డంపింగ్‌యార్డు

ఝరాసంగం, జూలై 16: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ మెరుగుపర్చడంతో పాటు, గ్రామపంచాయతీలకు అదనపు ఆదాయం సమకూర్చాలనే సంకల్పంతో గత ప్రభుత్వ హయాంలో పల్లెప్రగతిలో భాగంగా లక్షలు వెచ్చించి డంపింగ్‌యార్డులను నిర్మించారు. అయితే వీటి నిర్వహణను గాలికి వదిలేయడంతో అవి నిరుపయోగంగా మారాయి. దీంతో ప్రజాధనం వృథాగా మారింది. సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలంలో 33 గ్రామపంచాయతీలు ఉన్నాయి. జాతీయ ఉపాధిహామీ కింద ఒక్కొక్క పంచాయతీకి రూ.2.50 లక్షలతో కంపోస్టు షెడ్లు నిర్మించారు. దీంతో చెత్తను తరలించేందుకు ప్రతీ పంచాయతీకి ట్రాక్టర్‌ను సైతం కొనుగోలు చేశారు. షెడ్ల నిర్మాణం పూర్తయినా అవి పూర్తిస్థాయిలో ఉపయోగంలోకి రావడం లేదు. కొన్ని పంచాయతీల్లో ప్రారంభంలో కొంతమేర ఆసక్తి కనబర్చిన అధికారులు.. వాటిని పట్టించుకోకపోవడం వల్ల నిరుపయోగంగా మారాయి. పారిశుధ్య సిబ్బంది తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి డంపింగ్‌యార్డుకు తరలించాలి. అక్కడ కంపోస్టు షెడ్లులో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన అరలలో తడి, పొడి చెత్తను వేరుచేయాలి. వర్మీ కంపోస్టు తయారుచేసి అమ్మగా వచ్చిన సొమ్మును గ్రామపంచాయితీ అభివృద్ధికి వినియోగించాలి. తడి చెత్తను దాదాపు 45 రోజులపాటు దశలవారీగా ఎరువు తయారు చేయాల్సి ఉండగా.. ఆచరణలో మాత్రం అమలుకావడం లేదు. కనీసం ప్రజలకు తడి, పొడి చెత్తపై కూడా అధికారులు అవగాహన కల్పించడం లేదు.

అధికారుల పర్యవేక్షణ లోపం

మండలంలోని పలు గ్రామాల్లో చెత్తను డంపింగ్‌యార్డులకు తరలించడం లేదు. గ్రామాల్లో చెత్త రోడ్లు, డంపింగ్‌యార్డుల బయట దర్శనమిస్తున్నాయి. చెత్త నుంచి తీవ్రమైన దుర్వాసన వెదజల్లుతుంది. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో రోగాలు వచ్చే అవకాశం ఉన్నది. అధికారుల పర్యవేక్షణ లోపంతో చెత్తను డంపింగ్‌యార్డులకు తీసుకెళ్లకుండా ఎక్కడపడితే అక్కడ వేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.



డంపింగ్‌యార్డు బయట పారబోసిన చెత్తాచెదారం

జిల్లా అధికారి ఆదేశించినా స్పందన కరువు

జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా కొన్నిరోజుల క్రితం మండల కేంద్రమైన ఝరాసంగంతో పాటు, కప్పాడ్ గ్రామాల్లో ఏర్పాటుచేసిన డంపింగ్‌యార్డులను పరిశీలించి, అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ అధికారుల్లో స్పందన లేకుండాపోయింది. డంపింగ్‌యార్డులకు తడి, పొడి చెత్తను తరలించకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండకపోవడం కూడా డంపింగ్‌యార్డుల పరిస్థితి అధ్వానంగా మారింది.

సెగ్రిగేషన్ షెడ్లను ఉపయోగంలోకి తీసుకురావాలి



గ్రామాల్లో ఏర్పాటుచేసిన డంపింగ్‌యార్డులను వినియోగంలో తీసుకురావాలి. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని డంపింగ్‌యార్డు, రోడ్ల పక్కన చెత్తాచెదారం వేయకుండా చూడాలి. అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలి.

- యాదవరెడ్డి, గుంతమర్పల్లి

మత్తుకు అలవాటు పడితే భవిష్యత్తు అంధకారమే

● డీఎస్పీలు సత్తయ్యగౌడ్, పుష్పన్‌కుమార్


సదస్సులో మాట్లాడుతున్న సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్

పుల్‌కల్, జూలై 16: మాదకద్రవ్యాల వినియోగం వల్ల అనేక దుష్పరిణామాలు ఎదురవుతాయని, దురలవాట్లకు దూరంగా ఉండాలని సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్, తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డీఎస్పీ పుష్పన్‌కుమార్ పేర్కొన్నారు. చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో అధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.నరసింహ అధ్యక్షతన జరిగిన సదస్సులో వారు మాట్లాడారు. యువత మత్తుకు అలవాటు పడితే ఉజ్వల భవిషత్తు అంధకారమవుతుందని హెచ్చరించారు. ఎంతో మంది విద్యార్థులు మత్తుకు అలవాటు పడి క్రమేణ బానిసలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొంతమంది మత్తులో నేరాలకు పాల్పడి జైలు జీవితాలను అనుభవిస్తున్నారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.నరసింహ మాట్లాడుతూ యువత పెడదోవ పడితే దేశాభివృద్ధి కుంటుపడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాల వినియోగంతో ఉత్పన్నమయ్యే పరిణామాలపై లఘు చిత్రాన్ని ప్రదర్శించి, పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ రామునాయక్, జోగిపేట సీఐ అనిల్‌కుమార్, పుల్కల్ ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వై.రాఘవేందర్‌రావు, మెకానికల్ విభాగాధిపతి ప్రొఫెసర్ ప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పైడిగుమ్మల్‌కు వెళ్లేదెలా?

● మండల కేంద్రానికి 2 కిలోమీటర్ల దూరంలోనే ఉన్నా తప్పని తిప్పలు
● శిథిలమై గుంతలమయంగా మారిన తారురోడ్డు
● చిన్న వర్షానికే చిత్తడి
● మరమ్మతులను పట్టించుకోని అధికారులు



చిన్న వర్షానికి బురదమయంగా మారిన రహదారి, గుంతలమయంగా పైడిగుమ్మల్ ప్రధాన రోడ్డు

కోహీర్, జూలై 14: మండల కేంద్రానికి కేవలం రెండు కిలోమీటర్ల దూరంలోనే ఉన్న పైడిగుమ్మల్ గ్రామానికి వెళ్లాలంటే గ్రామస్థులకు వ్యయప్రయాసలు తప్పడం లేదు. గ్రామానికి గల ప్రధాన రహదారి పూర్తిగా పాడై నెలలు గడుస్తున్నా ఆ రోడ్డును బాగు చేసేందుకు అధికారులు చొరవ చూపడం లేదు. రోడ్డుపై అక్కడక్కడా పెద్ద గుంతలు ఏర్పడడంతో వాహనదారులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రమైన కోహీర్ నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పైడిగుమ్మల్ గ్రామం వరకు రోడ్డు పై అక్కడక్కడా గుంతలమయంగా తయారైంది. దీంతో ఈ రోడ్డు చిన్న వర్షానికి చిత్తడిగా మారి వాహనదారులపాలిట ప్రమాదకరంగా మారింది. ఇది తారు రోడ్డు అయినప్పటికీ నిర్మించి చాలాకాలం కావడంతో రోడ్డుపై తారు మొత్తం లేచిపోయి అక్కడక్కడా గుంతలు ఏర్పడ్డాయి. దీంతో రాత్రి వేళల్లో ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో ఈ రోడ్డుపై వెళ్లిన చాలా మంది ద్విచక్రవాహనదారులు అదుపుతప్పి పడిపోయి గాయాలైన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రోడ్డుకు కనీసం మరమ్మతు పనులైనా చేపట్టాలని పైడిగుమ్మల్ గ్రామస్థులు కోరుతున్నారు.

డీలక్స్ బస్సులో ప్రయాణించే మహిళలకు బహుమతులు


మాట్లాడుతున్న డీఎం మల్లేశయ్య

నారాయణఖేడ్, జూలై 16: ఆర్టీసీ డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే మహిళలకు ప్రతీ నెలలో మూడు సార్లు లక్కీడీప్ నిర్వహించి ముగ్గురు చొప్పున ఎంపిక చేసి బహుమతులను ఇవ్వనున్నట్లు స్థానిక ఆర్టీసీ డీఎం మల్లేశయ్య తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ డీలక్స్ బస్సుల్లో ప్రయాణం చేసిన మహిళలు బస్సు దిగే ముందు టికెట్ వెనుక భాగంలో తమ పేరు, ఫోన్ నెంబరును రాసి బస్సుల్లో ఏర్పాటు చేసిన గిఫ్ట్ బాక్సుల్లో వేయాలన్నారు. ప్రతి నెల 16, 30, 31 తేదీల్లో లక్కీడీప్ ద్వారా ముగ్గురు చొప్పున ఎంపిక చేసి ఆకర్షణీయమైన బహుమతులను అందిస్తామన్నారు. కందుకూరు వెళ్లే ప్రయాణికులు టికెట్‌తో పాటు రిటర్న్ టికెట్ ఆన్‌లైన్‌లో ఒకేసారి బుక్ చేసుకుంటే పదిశాతం రాయితీ ఉంటుందన్నారు. నెలవారీ సీజనల్ టికెట్‌తో 20 రోజుల ప్రయాణ చార్జీతో 30 రోజులు పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణించే అవకాశం కల్పిస్తున్నామన్నారు. ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తూ సంస్థ అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం 9551071134, 9676667703, 9959223170 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


రవికుమార్, వైద్యాధికారి

చేగుంట, జూలై 16: వర్షా కాలంలో మలేరియా డెంగీ వ్యాధులు సోకే అవకాశం ఉన్నందున నివాస పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నార్సింగి వైద్యాధికారి రవికుమార్ తెలిపారు. నార్సింగి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎప్పటికప్పుడు వేడి ఆహారం తీసుకోవాలన్నారు. నివాసాల పరిసర ప్రాంతాల్లో వర్షం నీరు నిలువకుండా చూడాలన్నారు. కాచి చల్లార్చిన నీరు తాగాలని సూచించారు. ప్రతి ఒక్కరూ వర్షా కాలంలో ఆరోగ్యం పట్ల పలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి తెలిపారు.

విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఉచిత న్యాయ సహాయం


గురుకులంలో విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్

సంగారెడ్డి అర్బన్, జూలై 16 : విద్యార్థులు, ఉపాధ్యాయుల న్యాయపరమైన విషయాల్లో ఉచిత న్యాయ సహాయం అందిస్తామని, ఏదైనా అవసరమైతే న్యాయసేవాధికార సంస్థ కార్యాలయాన్ని సంప్రదించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్ సూచించారు. సంగారెడ్డిలోని మైనారిటీ గురుకుల బాలికల పాఠశాలను ఆయన మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పిల్లల వసతి గృహం, వంట గది, బాత్‌రూమ్స్, టాయిలెట్స్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ హింస, బాల్య వివాహ నిషేధ చట్టం, పోక్సో, వరకట్న నిషేధ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అంతకు ముందు పట్టణంలోని శ్రీతేజ జూనియర్ కాలేజీలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించి విద్యార్థులకు ర్యాగింగ్, జువైనల్ జస్టిస్, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

బోరంచ నల్ల పోచమ్మ హుండీ లెక్కింపు


హుండీ కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

మనూరు, జూలై 16: తెలంగాణలో ప్రసిద్ధి గాంచిన బోరంచ నల్ల పోచమ్మ ఆలయం హుండీ కానుకలను మంగళవారం లెక్కించారు. మనూరు మండలం బోరంచ మంజీరా నది ఒడ్డున వెలసిన బోరంచ నల్లపోచమ్మ ఆలయం ఉత్సవాలు ఏటా ఏడు వారాల పాటు కొనసాగుతుంది. ఇటీవలే ఉత్సవాలు ముగిసిన అనంతరం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని చేపట్టారు. రూ.12 లక్షలు సమకూరినట్టు స్థానిక ఈవో శివ రుద్రప్ప తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎండోమెంట్‌అధికారి శివరాజ్ అధికారులు శివానంద్, భుజలింగం, ఏఎస్ఐ తులసీరాం ఉన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తలు అధైర్యపడొద్దు

● బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గోవర్ధన్ రెడ్డి భరోసా

గుమ్మడిదల, జులై 16 : బీఆర్ఎస్ కార్యకర్తలు అధైర్య పడొద్దని, పార్టీ అధిష్ఠానం ఎల్లవేళలా అండగా ఉంటుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి తెలిపారు. సోమవారం పటాన్‌చెరు బీఆర్ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కాంగ్రెస్‌పార్టీలో చేరడం, ఎమ్మెల్యేతో పాటు మరి కొంతమంది నాయకులు పార్టీ మారడంపై గోవర్ధన్ రెడ్డి స్పందించారు. మంగళవారం గుమ్మడిదల క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల ఉద్యమాల పోరాటం చేసిన బీఆర్ఎస్ పార్టీకి నాయకత్వం కొదవ ఉండదని, ప్రతీ ఒక్క ఉద్యమకారుడు నాయకుడేనని, భయపడాల్సిన అవసరం లేదన్నారు. గుమ్మడిదల మండల బీఆర్ఎస్ నాయకులు త్వరలో సమావేశం ఏర్పాటు చేసుకొని పార్టీ బలోపేతంపై దృష్టి సారించి ముందుకు పోతామన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

5వ రోజుకు చేరిన రైతుల దీక్ష

నర్సాపూర్, జూలై 16: రైతులు సంగారెడ్డి కెనాల్ కోసం భూములు ఇచ్చేందుకు ససేమిరా అంటూ చేపట్టిన రిలేదీక్ష మంగళవారం 5వ రోజుకు చేరుకుంది. 5వరోజు దీక్షలో రైతులు నర్సింహారెడ్డి, శివమల్లయ్య, అంజనేయులు, రమేష్, సత్యగౌడ్, మహేష్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలువ వద్దు సెమి అర్బన్‌గా ఈ ప్రాంతం అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు.

రాణాపూర్‌లో ఘనంగా మొహర్రం

నారాయణఖేడ్, జూలై 16: నారాయణఖేడ్ డివిజన్ పరిధిలో మనూర్ మండలం రాణాపూర్‌లో మొహర్రం మంగళవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాల్లో గ్రామస్థులతో పాటు రెడ్డి సామాజిక వర్గం, లింగాయత్ సామాజికవర్గం, గౌడ సామాజిక వర్గాలతో పాటు, అన్నివర్గాల వారు పాల్గొన్నారు. మొహర్రం సందర్భంగా ఇక్కడ మూడు రోజుల పాటు వివిధ కార్యక్రమాలు జరుగుతాయి.

ఎంఎల్‌హెచ్‌పీలను సీహెచ్‌వోలుగా పరిగణించాలి

సంగారెడ్డి అర్బన్, జూలై 16: వైద్య ఆరోగ్య శాఖలో ఎంఎల్‌హెచ్‌పీలను సీహెచ్‌వోలుగా పరిగణించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సాయిలు డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని ఐబీలో పలువురు ఎంఎల్‌హెచ్‌పీలు మంగళవారం ఏఐటీయూసీలో చేరారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాయిలు, ప్రసాద్ మాట్లాడుతూ ఎంఎల్‌హెచ్‌పీలకు ప్రతీ నెల 1వ తేదీన జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఐదేళ్లు దాటిన చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్చాలి

● పలు మండలాల్లో ముమ్మరంగా 'అమ్మ మాట- అంగన్‌వాడీ బాట' ● చిన్నారులతో ర్యాలీలు


నర్సాపూర్‌లో చిన్నారులతో ర్యాలీని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్


తూప్రాన్‌లో జెండా ఊపి బడిబాట ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

నర్సాపూర్, జూలై 16: ఐదేళ్లు దాటిన ప్రతీ చిన్నారిని సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని, తద్వారా ఆరోగ్యంతో పాటు విజ్ఞానాన్ని పునికిపుచ్చుకుంటూ మంచి పిల్లలుగా ఎదుగుతారని మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం నర్సాపూర్ పట్టణంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా చిన్నారులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సురేష్, యాదగిరి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు భిక్షపతి, సూపర్‌వైజర్ సరళ, అంగన్‌వాడీ టీచర్లు అన్నపూర్ణ, వరలక్ష్మి, మంజు, రేణుక, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

● తూప్రాన్: పట్టణంలో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో మంగళవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. తూప్రాన్‌లో చేపట్టిన బడిబాట కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతికృష్ణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతికృష్ణ మాట్లాడుతూ.. ఐదేళ్లు దాటిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖాజామొహియుద్దీన్, కౌన్సిలర్లు కొడిప్యాక నారాయణగుప్తా, రామునిగారి శ్రీశైలంగౌడ్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అంజమ్మ, అంగన్‌వాడీ టీచర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● మునిపల్లి: మండల పరిధిలోని చిన్నచెల్మెడ గ్రామంలో మంగళవారం అమ్మ మాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని అంగన్‌వాడీ టీచర్ మీనాక్షి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శైలజ పాల్గొని మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. రెండేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని ప్రజలకు సూచించారు. పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపకుండా అంగన్‌వాడీ కేంద్రాల్లోనే వేయాలని, ఇందులో నర్సరీ తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ ఆయా, ఆశావర్కర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాలలో దిశా శిబిరం


ఉన్నత విద్య, బాల్య వివాహలపై మాట్లాడుతున్న విద్యార్థినులు

సదాశివపేట, జూలై 16: పట్టణంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో 'దిశా విద్యా శిబిరం'ను జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. శిబిరంలో కౌమారదశలో ఉన్న బాలబాలికలు తమ భవిష్యత్తును గురించి ఆలోచించడంతో పాటు చక్కటి చదువులతో కేరీర్, బాలికల మానసిక ఆరోగ్యం, బాల్య వివాహాలను వ్యతిరేకించడం, బాలికల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. శిబిరంలో పాఠశాల ప్రిన్సిపాల్ లలిత, సిబ్బంది పాల్గొన్నారు.

'గూడెం'ను కలిసిన కాంగ్రెస్ నాయకులు


మహిపాల్‌రెడ్డిని అభినందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పటాన్‌చెరు, జూలై 16: కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిని నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, తెల్లాపూర్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు చిలకమర్రి ప్రభాకర్‌రెడ్డి, డోకూరిరామ్మోహన్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యుడు బాబు, నాయకులు అతిక్ తదితరులు ఎమ్మెల్యేను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కలిసి కట్టుగా కాంగ్రెస్ ప్రభుత్వ సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు.

ధరణి సమస్యలు పరిష్కరించాలి

● రైతుసంఘం రాష్ట్ర నాయకుడు గొల్లపల్లి జయరాజు

మునిపల్లి, జూలై 16: పెండింగ్‌లో ఉన్న ధరణి భూ సమస్యలు పరిష్కరించాలని రైతుసంఘం రాష్ట్ర నాయకుడు గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రమైన మునిపల్లిలో రైతులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ధరణి భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం మారినా.. స్పెషల్ డ్రైవ్ పెట్టినా సమస్యలు మాత్రం పరిష్కారం కాక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ శ్రద్ధ చూపి పెండింగ్‌లో ఉన్న ధరణి భూ సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్ గౌడ్, శ్రీనివాస్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే జైలుకే

కల్హేర్, జూలై 16;మద్యం సేవించి వాహనాలు నడిపినా, వాహనాలకు పూర్తిస్థాయి అనుమతి పత్రాలు లేకున్నా చర్యలు తప్పవని సిర్గాపూర్ ఎస్ఐ వెంకట్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం సిర్గాపూర్, నారాయణఖేడ్ రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. ఇద్దరు మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

పత్తి, సోయా సస్యరక్షణపై రైతులకు అవగాహన

నారాయణఖేడ్, జూలై 16: పత్తి, సోయా రైతులు చీడపీడల నివారణకు ఎప్పటికప్పుడు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని స్థానిక ఏడీఏ నూతన్‌కుమార్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని అబ్బెంద, మనూరు మండలం ఎల్గోయిలలో పత్తి, సోయా వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి రైతులకు అవగాహన కల్పించారు. మొక్కలు ఎదగడానికి ముందు గుంటుకలు తోలడం వల్ల కలుపు నివారణతో పాటు వేరు వ్యవస్థ ధృడమవుతుందన్నారు. గాలి, సూర్యరశ్మి మొక్కలకుతగిలి మొక్కలు ఏపుగా ఎదుగుతాయన్నారు. పత్తి పంటలో రసం పీల్చే పురుగులు తెల్లదోమ, పచ్చదోమ, పేను నివారణకు ఎసిటీమెప్రీడ్ మందును 0.2 గ్రాములు, ఒక లీటర్‌నీటిలో లేదా ఇమిడాక్లోపెడ్ 0.25 మిల్లి లీటర్లు లీటర్ నీటిలో కలిపి, 5 మిల్లిలీటర్ల వేప నూనెను కలిపి పిచికారి చేయాలన్నారు. ఆయన వెంట ఏఈవోలు, తదితరులు ఉన్నారు.

రుణమాఫీ మార్గదర్శకాలను సవరించాలి

● మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, జూలై 16: రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ విషయంలో ప్రకటించిన మార్గదర్శకాలను సవరించాలని మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం రుణమాఫీ విషయంలో ప్రకటించిన షరతులను మార్చాలంటూ మంగళవారం ఆయన ఒక ప్రకటనలో కోరారు. ఎన్నికల హామీలో ఇచ్చిన విధంగా ప్రతీ రైతుకు రుణమాఫీ చేయాలన్నారు. రేషన్‌కార్డు నిబంధనను తొలగించాలని సూచించారు. గత హామీ మేరకు పథకం వర్తిస్తే రాష్ట్రవ్యాప్తంగా 31లక్షల మందికి న్యాయం జరుగుందని చెప్పారు. అంతేగాకుండా రీషెడ్యూల్‌కు సైతం ఈ పథకాన్ని వర్తింపజేయాలని కోరారు. రూ.2 లక్షల రుణాన్ని రైతులందరికి మాఫీ చేసేలా నిబంధనలను మార్చాలన్నారు.

మంత్రి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన రాధాకిషన్ గుప్తా

రేగోడు ఏప్రిల్ 23: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సమక్షంలో మంగళవారం రేగోడు గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. సంగారెడ్డిలోని మంత్రి నివాసంలో మాజీ పీపీసీఎస్ చైర్మన్ రాధాకిషన్ గుప్తా, రమేష్, నర్సింహులు. శ్రీశైలం నగేష్, గంగారాంలతో పాటు పలువురికి మంత్రి దామోదర్ రాజనర్సింహ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు.

'దళితులపై దాడులు అరికట్టాలి'

నిజాంపేట, జూలై 16: దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టి, ఎస్సీ ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి శంకర్ అన్నారు. మెదక్ జిల్లా దళిత సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ప్రజా భవన్ బయలుదేరి ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులపై దాడులు నిత్యకృత్యంగా కొనసాగుతున్నాయన్నారు. ముఖ్యంగా ఎస్సీ ఎస్టీ అత్యాచారాలు నిరోధక చట్టాన్ని సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. ఇప్పటికైనా ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని సక్రమంగా అమలు చేసి దళితులకు న్యాయం చేయాలని అన్నారు. కార్యక్రమంలో డీబీఎఫ్ మెదక్ జిల్లా అధ్యక్షుడు దుబాసి సంజీవ్ జాతీయ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కల్లూరిసంజు,ఉరుట్ల శివ, పరశురాములు ఉన్నారు.

హ్యూమన్ రైట్స్ చైర్మన్‌ను సన్మానించిన జహీరాబాద్ ఎంపీ


అబ్దుల్ రహీంను సన్మానిస్తున్న ఎంపీ సురేష్ షెట్కార్

నారాయణఖేడ్,జూలై 16: నేషనల్ హ్యూమన్ రైట్స్ తెలంగాణ రాష్ట్ర చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అంబేడ్కర్ పూలే సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ రహీంను మంగళవారం జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ సన్మానించారు. నాగల్‌గిద్ద మండలం ఏస్గీ గ్రామానికి చెందిన అబ్దుల్ రహీం సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయికి ఎదిగాడని, భవిష్యత్తులో మరింత పైకి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఆయన వెంట సంఘంనాయకులు పండరి, తయ్యుబ్ ఉన్నారు.

బోనాలతో అలరించిన చిన్నారులు

వట్‌పల్లి, జూలై 16: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని మంగళవారం వట్‌పల్లిలో బోనాల ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్థానిక అక్షర పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు చూపరులను ఆకట్టుకున్నాయి. పాఠశాలకు చెందిన చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలను తిలకించేందుకు స్థానికులు భారీగా హాజరయ్యారు. పాఠశాల నుంచి చిన్నారుల ఆట పాటలు, విన్యాసాలతో ప్రారంభమైన బోనాలతో ఊరేగింపు శ్రీ దుర్గామాత ఆలయం వరకు చేరుకుని అమ్మవారికి బోనాలను సమర్పించారు. కాగా ఏటా గ్రామస్థులు నిర్వహించే బోనాల వేడుకలను ఈసారి పాఠశాల విద్యార్థులు నిర్వహించడం అందరినీ ఆకట్టుకున్నాయి.


వట్‌పల్లి చౌరస్తా వద్ద వివిధ వేషధారణలో నృత్యాలు చేస్తూ అలరిస్తున్న చిన్నారులు

నాటిన ప్రతి మొక్కనూ రక్షించాలి

● నర్సరీలను పరిశీలించిన అధికారులు
● వన మహోత్సవంలో నాటేందుకు మొక్కలు సిద్ధం
● పలు గ్రామాల్లో ఇంటింటా మొక్కల పంపిణీ


శివ్వంపేట: శభాష్‌పల్లిలో మొక్క నాటిన డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు


పుల్కల్: అనంత పద్మనాభస్వామి ఆలయం వద్ద కొబ్బరి మొక్క నాటుతున్న ఎంపీడీవో ఆనందమేరి

శివ్వంపేట, జూలై 16: నాటిన ప్రతి మొక్కనూ రక్షించేలా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్‌రావు తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించి నర్సరీలను, పండ్ల తోటల పెంపకం పనులను పరిశీలించారు. శభాష్‌పల్లి గ్రామంలో ఎవెన్యూ ప్లాంటేషన్‌లో నాటిన మొక్కలకు నీరు పోసి, నర్సరీని పరిశీలించారు. ఉసిరికపల్లిలో ఫాంపాండ్, భీమ్లా తండాలో పండ్ల తోటల పెంపకం పనులను పరిశీలించారు. వెంట పంచాయతీ కార్యదర్శి వీణకుమారి, ఫీల్డ్ అసిస్టెంట్ దామోదర్, ఐకేపీ సిబ్బంది ఉన్నారు.

● మాసాయిపేట: వన మహోత్సవానికి వెల్దుర్తి, మాసాయిపేట ఉమ్మడి మండలంలో వివిధ రకాల మొక్కలు సంసిద్ధంగా ఉన్నాయని వెల్దుర్తి ఎంపీడీవో విఘ్నేశ్వర్ తెలిపారు. మంగళవారం మాసాయిపేట మండల కేంద్రంలోని నర్సరీ మొక్కలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ఉమ్మడి మండలాలైన వెల్దుర్తి మాసాయిపేట మండలాల్లో 30 నర్సరీలను పెంచామని, 2.50 లక్షల వివిధ రకాల మొక్కలు నాటడానికి సంసిద్ధంగా ఉన్నాయని, వనమహోత్సవంలో భాగంగా త్వరలో వాటిని మండలంలోని వివిధ గ్రామాల్లో నాటనున్నట్లు ఆయన తెలిపారు. ఉమ్మడి మండలాల్లోని మూడు గ్రామాల్లో వీఐపీ పాయింట్లు గుర్తించామని, అక్కడ జిల్లా ముఖ్య అధికారుల ఆధ్వర్యంలో వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. వివిధ రకాల పండ్ల మొక్కలతో పాటు రైతులకు అనువైన మొక్కలు అందుబాటులో ఉన్నాయన్నారు. మొక్కలు కావలసిన వారు ఆయా గ్రామాల కార్యదర్శులతో సంప్రదించి నర్సరీల నుంచి మొక్కలు పొందవచ్చని ఎంపీడీవో సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో రాజు, గ్రామ కార్యదర్శి బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

● కొల్చారం: ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి సంరక్షించాలని కొల్చారం ఎంపీడీవో లక్ష్మీనర్సింహులు పేర్కొన్నారు. మండలంలోని పోతిరెడ్డిపల్లి, కొంగోడు, నాయిన్ జలాల్‌పూర్ గ్రామాల్లో మంగళవారం వనమహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీవో మహిపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు మౌనిక, సౌజన్య, ఫీల్డ్ అసిస్టెంట్లు సత్యనారాయణ, యాదుల్ తదితరులు పాల్గొన్నారు.

● అల్లాదుర్గం: పర్యావరణ పరిరక్షణ కోసం ఇంటింటా మొక్కలను నాటి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అల్లాదుర్గం ఎంపీడీవో శంకర్ యాదవ్, ఈజీఎస్ ఏపీవో సుధాకర్ సూచించారు. వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలో ఇంటింటా మొక్కలను పంపిణీ చేశారు. మండలంలోని చిల్వర్ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో మాట్లాడుతూ.. మండలంలో 75 వేల మొక్కలను నాటాలన్న లక్ష్యంతో ప్రణాళికలను రూపొందించామన్నారు. ఇందులో ప్రజలకు, రైతులకు దోహదపడే విధంగా పండ్ల మొక్కలు, పూల మొక్కలతో పాటు ఇతర మొక్కలు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● వెల్దుర్తి: వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు నర్సరీలలో సిద్ధంగా ఉన్నాయని వెల్దుర్తి ఇన్‌చార్జి ఎంపీడీవో విఘ్నేశ్వర్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని హస్తాల్‌పూర్ గ్రామంలో నర్సరీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంచార్జి ఎంపీడీవో మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా లక్ష50వేల మొక్కలు నాటడమే లక్ష్యమన్నారు. అందుకు మొక్కలు సిద్ధంగా ఉన్నాయని, గుంతలను కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. వెల్దుర్తి పంచాయతీ కార్యాలయంలో ఈవో బలరాంరెడ్డి ఇంటికి ఆరు మొక్కల చొప్పున పంపిణీ చేశారు.

● పుల్‌కల్: చౌటకూర్ మండలం చక్రియాల గ్రామంలో మంగళవారం వన మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీడీవో ఆనందమేరీ హాజరై స్థానిక శ్రీ లక్ష్మీ అనంతపద్మనాభస్వామి ఆలయ ప్రాంగణంలో కొబ్బరి, మామిడి, ఇతర పండ్ల మొక్కలను నాటి నీళ్లు పోశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బసీర్, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో సంతోష్, క్షేత్రస్థాయి సహాయకులు త్రిలోక్, నాయకులు చిన్నరోళ్లపాటి రాజశేఖర్, విజయభాస్కర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, తుంగె పండరి, తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి


తహసీల్ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న ముదిరాజ్‌సంఘం నాయకులు

రేగోడు జూలై 16: ముదిరాజ్ కులానికి కార్పొరేషన్ ఏర్పాటు చేసి అభివృద్ధి నిధులు ఇవ్వాలని మండల ముదిరాజ్‌సంఘం నాయకులు మంగళవారం రేగోడు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. ముదిరాజులను బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి మార్చాలన్నారు. చెరువులు కుంటలపై ముదిరాజులకు పూర్తి హక్కులు కల్పించాలని, మత్స్య శాఖ చేప పిల్లలను సకాలంలో అందివ్వాలని కోరారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు వడ్డేపల్లి శివకుమార్, గొండ్ల బసవేశ్వర్, బోయిని దత్తు, సాయిలు, దుర్గయ్య, రాములు, రమేష్, లక్ష్మణ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు

లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహబంధు కార్యవర్గం

నర్సాపూర్, జూలై 16: నర్సాపూర్ లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహబంధు ద్వారా నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలు మరింతగా విస్తృతం చేయాలని పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రామకృష్ణారెడ్డి, పీడీటీ నర్సింహారెడ్డి, పీఆర్‌వో రాఘవేందర్‌రావు ఆధ్వర్యంలో 2024-25 సంవత్సరానికి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మంద జైపాల్, కార్యదర్శిగా కొండశ్రీకాంత్, కోశాధికారిగా మాణిక్యంలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గత కొన్నేళ్లుగా ఈ ప్రాంతంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రత్యేకతను చాటుకుంటుందన్నారు. అదే స్ఫూర్తితో నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో కూడా సేవలు మరింత విస్తృత పరిచి గ్రామీణ ప్రాంత ప్రజలకు సేవా కార్యక్రమాలు అందేలా కృషి చేయాలని ఆకాంక్షించారు.